యూజీసీ న్యాక్ గుర్తింపునకు కృషి చేద్దాం

ఓయూ వీసీ ప్రొ.కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: యూజీసీ న్యాక్ గుర్తింపునకు కృషి చేద్దామని ఓయూ వీసీ ప్రొ.కుమార్ పేర్కొన్నారు. శనివారం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో న్యాక్ గుర్తింపునకు అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ గతంలో ఏడున్నర సంవత్సరాలకు లభించిన న్యాక్ ఎ ప్లస్ గుర్తింపును తిరిగి పొందేందుకు అధ్యాపకులు, ఉద్యోగులు కృషిచేయాలన్నారు. న్యాక్ గుర్తింపుతో ఓయూకు నిధులు పెరుగుతాయని తద్వారా నాణ్యత ప్రమాణాలతో కూడిన బోధన, పరిశోధనతో ఓయూ ప్రతిష్ట పెరుగుతుందన్నారు. రిజిస్ట్రార్, ఓఎస్‌డీతో పాటు ప్రొఫెసర్లు ప్రిన్సిపాళ్లు, డీన్లు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ పూజలు



బొద్ధనగర్: పార్సిగుట్ట అశోక్‌నగర్ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. సంఘం అధ్యక్షులు వనం చంద్రమౌళి మాట్లాడుతూ పద్మశాలీయులు మార్కండేయ మహర్షిని మూలపురుషుడుగా భావించి పూజిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బొమ్మ నరేందర్, దోమల శ్రీధర్, కోడూరి శివశంకర్, మంద వెంకట స్వామి, గంజి శ్రీనివాస్, రమేష్, శ్రీకాంత్, నవీన్, మంద ఈశ్వర్, బాలాజీ, సాయి కృష్ణలు పాల్గొన్నారు.

అన్వేషికి ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ జర్నలిజం విభాగం విద్యార్థిని రిని అన్వేషికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం విశ్రాంత అధ్యాపకులు ప్రొ.నరేందర్ పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను ప్రచారం విషయంలో మీడియా పాత్ర అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: అనారోగ్యంతో బాధపడుతున్న సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీకి చెందిన లింగంపల్లి చెంచులక్ష్మికి బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆర్థికంగా చేయూతనందించారు. చికిత్స చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతుందన్న విషయం తెలుసుకున్న ఆయన చికిత్స నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

వర్గీకరణకు అందరూ మద్దతిస్తున్నారు

సనత్‌నగర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 7న ఎల్బీ స్టేడియం వేదికగా జరిగే వేయి గొంతుకలు.. లక్ష డప్పులు కార్యక్రమానికి తరలిరావాలంటూ బేగంపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు సొట్ట నరేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అన్ని పక్షాల నుంచి మద్దతు లభిస్తోందన్నారు

మహిళలు, రైతుల అభివృద్ధికి బడ్జెట్ దోహదం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్ తదితరులు

రాంగోపాల్‌పేట్: పేదలు, మహిళలు, యువత, రైతుల అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ దోహదం చేస్తుందని తెలంగాణ స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ సికింద్రాబాద్ అధ్యక్షులు అమ్మనబోలు ప్రకాష్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ ప్రాంతంలోని అన్నపూర్ణ రెసిడెన్సీలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్య తరగతి వేతన జీవులకు ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.12 లక్షల వరకు పెంచడం గొప్ప ఉపశమనం కలిగిస్తుందన్నారు. వ్యక్తిగత ఆదాయ పన్ను విషయంలో కేవలం మూడు శ్లాబులు ఉండాలని, రూ.10లక్షల వరకు ఎలాంటి పన్ను లేదని అన్నారు.

ఉక్కిరిబిక్కిరి..

నాలాల్లోకి రసాయన వ్యర్థ జలాలు

బేగంపేటలో ఘాటైన వాసనలు
- నాలా పరీవాహక ప్రాంత ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని పీసీబీ అధికారులు



బేగంపేట నాలా

సనత్‌నగర్: రసాయన వ్యర్థ జలాల ప్రవాహంతో బేగంపేట నాలా పరివాహక ప్రాంత ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జీడిమెట్ల, కూకట్‌పల్లి, ప్రశాంత్‌నగర్, బాలానగర్, సనత్‌నగర్, ఫతేనగర్ తదితర పారిశ్రామికవాడల నుంచి వచ్చే నాలా బేగంపేట మీదుగా హుస్సేన్‌సాగర్‌కు కలుస్తుంది. ఈ క్రమంలో ఆయా పారిశ్రామికవాడల్లో రసాయన వ్యర్థ జలాలను నాలాల్లోకి వదలడం మూలంగా అవి ప్రవహిస్తూ నాలాకు ఇరువైపులా ఉండే నివాసిత ప్రాంత ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తోంది. ముఖ్యంగా అర్ధరాత్రి వేళల్లో ఘాటైన వాసనలతో కూడిన వ్యర్థ రసాయన జలాలు నాలా నీటిలో కలుస్తూ బేగంపేట ప్రాంతవాసులను ఊపిరి పీల్చుకోనివ్వడం లేదని వాపోతున్నారు. బేగంపేట వద్ద నాలా నీటిని గమనిస్తే రసాయనాలతో రంగు మారి ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. పగటిపూట అంతగా లేకపోయినా రాత్రివేళల్లో రసాయన వాసనలు ఎక్కువగా వస్తాయని, తద్వారా తెలియకుండానే వాటిని పీలుస్తూ అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బేగంపేట ప్రాంతానికి సమీపంలోనే ప్రశాంత్‌నగర్, బాలానగర్, ఫతేనగర్ పారిశ్రామికవాడలు ఉండడం, నాలాను ఆనుకుని ఎన్నో పరిశ్రమలు తమ కార్యకలాపాలను కొనసాగించడం. తద్వారా ఆయా పరిశ్రమల నుంచి వివిధ రకాలుగా వెలువడే వ్యర్థ రసాయనాలను నాలాల్లోకి వదులుతున్నారు. దీంతో నేరుగా ఆ రసాయనాలు పక్కనే ఉన్న బేగంపేట ప్రాంతంలో నాలాను ఆనుకుని ఇందిరాగాంధీపురం, మయూరిమార్గ్, బ్రాహ్మణవాడీ, వడ్డెర బస్తీ, ప్రకాష్‌నగర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌తో పాటు తదితర బస్తీలు ఉన్నాయి. మొన్నటివరకు నాలా ముంపు సమస్యతో సతమతమైన ఆయా బస్తీల ప్రజలు ఇప్పుడు వ్యర్థ జలాధీల వాసనల బారిన పడి నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని మొరపెట్టుకుంటున్నారు.

భూగర్భ జలాలు కలుషితం..?

రసాయన వ్యర్థ జలాలు నాలాలోకి కలవడం, ప్రవాహం కూడా అంతగా లేకపోవడంతో భూమిలోకి కలిసిపోయి కొంతదూరం వరకు భూగర్భ జలాలు కలుషితమవుతాయని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం జలమండలి ద్వారా నీటి సరఫరా అవుతుండగా, పలుచోట్ల ఆ నీరు సరిపోక బోర్లపై ఆధారపడుతూ వస్తున్నారు. ఈ క్రమంలో బోర్ల నుంచి కలుషిత నీరు సరఫరా అయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు. కలుషితమైన ఆ నీటిని సేవిస్తే వివిధ రకాల ఆరోగ్య సమస్యలు ఎక్కడ సంభవిస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రసాయన వ్యర్థ జలాలు నాలాలోకి కలవకుండా చూడాలన్నారు.

శుద్ధి లేకుండానే..

ఎంప్లాయ్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఈటీపీ)ల ద్వారా నీటిని శుద్ధి చేసి నాలాల్లోకి వదలాల్సి ఉండగా కొన్ని రసాయన కంపెనీలు నేరుగా వదులుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇందు కోసం ఈటీపీలను ఏర్పాటుచేసుకోవాలని పరిశ్రమలకు పీసీబీ దిశా నిర్దేశాలు కూడా చేసింది. అయితే ఇదంతా భారీ ఖర్చుతో కూడుకున్న పని అయినందున కొన్ని పరిశ్రమలు నాలాలోకి వదిలి చేతులు దులుపుకుంటున్నాయనే వార్తలు వెల్లువెత్తుతున్నాయి.

- పీసీబీ కూడా తనిఖీలు చేపడుతూ అలాంటి పరిశ్రమలపై చర్యలు తీసుకుంటున్నా గుట్టుచప్పుడు కాకుండా నాలాలోకి వ్యర్థ రసాయన జలాలను వదులుతుండడం మూలంగా అనారోగ్య పరిస్థితులు తలెత్తుతున్నాయి.
- ఉంటే ఫతేనగర్ వద్ద జీహెచ్‌ఎంసీ ఈటీపీలను ఏర్పాటుచేసినా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడంతో నేరుగా రసాయనాల ప్రభావాన్ని కలిగిన జలాలు నాలాలో కలిసి వస్తున్నాయి.
- ప్రశాంత్‌నగర్, బాలానగర్, ఫతేనగర్ పారిశ్రామికవాడల నుంచి యథేచ్ఛగా నాలాలోకి డంప్ చేస్తున్న రసాయనాలు ఈటీల ద్వారా శుద్ధి లేకపోవడం, దీంతో రసాయనాల గాఢత తగ్గకపోవడంతో నేరుగా బేగంపేట ప్రాంత ప్రజలపై ఆ ప్రభావం పడుతుంది.

పీసీబీ అధికారుల దృష్టికి తీసుకువెళతాం

నాలాలో రసాయన వ్యర్థ జలాలు ప్రవహిస్తుండడం మూలంగా వాసనల బారిన పడుతున్నామని నాలా పరివాహక ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రసాయనాలు నాలాల్లోకి వదలకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. కానీ ఎక్కడోచోట గుట్టుచప్పుడు కాకుండా రసాయన వ్యర్థ జలాలను నాలాల్లోకి వదలడం మూలంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై పీసీబీ అధికారులను కలిసి విన్నవిస్తాం. – కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి

మా బాధలను పట్టించుకోండి

ప్రధానంగా రాత్రివేళల్లో ఘాటైన వాసనలు వస్తున్నాయి. నాలాలో నీటిని చూస్తే రసాయనాలు కలవడం స్పష్టంగా తెలుస్తోంది. శుద్ధి చేయకుండా రసాయనాలను నాలాలోకి వదలడం మూలంగా భూగర్భ జలాలు కూడా కలుషితమయ్యే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులు దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. – శ్రీనివాస్, మయూరిమార్గ్

మరో పది చోట్ల డేకేర్ సెంటర్లు

జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి



బహుమతులు అందజేస్తున్న జీహెచ్‌ఎంసీ (యూసీడీ) అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి

సనత్‌నగర్: సీనియర్ సిటిజన్స్ సంక్షేమంతో పాటు వారి మానసికోల్లాసానికి మరిన్ని డేకేర్ సెంటర్లను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్‌ఎంసీ (యూసీడీ) అడిషనల్ కమిషనర్ సి.చంద్రకాంత్ రెడ్డి తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు వారికి శనివారం బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఆసరా సర్కిల్ కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి ఆధ్వర్యంలో మోడల్‌కాలనీ అధ్యక్షుడు సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు అధ్యక్షతన మోడల్‌కాలనీలోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో మరో 10 ప్రాంతాల్లో డేకేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆసరా సర్కిల్ కమిటీల ద్వారా చేపట్టే కార్యక్రమాలు, డేకేర్ సెంటర్లలో జరిగే కార్యకలాపాలను సావనీర్ ద్వారా తీసుకువస్తే ఎంతోమందికి స్ఫూర్తిగా ఉంటుందన్నారు. ఎస్సార్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటరమణ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ ఫోన్ల వాడకంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ మోసాల బారిన పడి ఎంతోమంది మోసపోతున్న ఘటనలు చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాసులు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సునీతకుమారి పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

రసూల్‌పురా: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆంగ్లభాషపై పూర్తి పట్టు సాధించాలని పికెట్ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాల ప్రిన్సిపల్ రూపిందర్ సింగ్ సూచించారు. శనివారం పాఠశాలలో ఆంగ్ల దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం విద్యార్థుల ఆధ్వర్యంలో ది బిషప్ క్యాండిల్ స్టిక్స్ నాటకం, ఉహాత్మక ప్రపంచంలో తాంత్రికుల శోధన స్కిట్, పాటల కచేరీ, కవిత్వ పఠనం తదితర ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రూపిందర్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించేందుకు చదవడం, రాయడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ నైపుణ్యాల్లో కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డాక్టర్ మధుసూధన్ చారి, వర్జీనియా, సుందర్ రాజ్, కో-ఆర్డినేటర్ పద్మజ, దివ్య ఆసీష్ మౌమిత పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఆరోగ్య విషయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో శనివారం రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట డివిజన్లకు చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ చెక్కులను పంపిణీ చేశారు. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, బీఆర్‌ఎస్ నేతలు గణేష్, జనార్దన్, లభిషేక్, లడ్డూ, సాయిబాబా, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి సత్కారం



డాక్టర్ సక్కుబాయిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: వైద్యాధికారిగా సికింద్రాబాద్ ప్రాంతానికి సుదీర్ఘ సేవలు అందించిన డాక్టర్ సక్కుబాయి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సక్కుబాయిని శనివారం సీతాఫల్‌మండిలో అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది సన్మానించారు. ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ప్రాంతానికి డాక్టర్ సక్కుబాయి అందించిన వైద్య సేవలను ప్రశంసించారు. సీతాఫల్‌మండి అర్బన్‌హెల్త్ సెంటర్ సిబ్బంది, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, బీఆర్‌ఎస్ నాయకుడు వైవీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యం ఏర్పరచుకోవాలి



జ్ఞాపికలు అందజేస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించేందుకు ముందుకు వెళ్లాలని ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. శనివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జేఎస్‌ఆర్ పాఠశాల వార్షికోత్సం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఏర్పరచుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి క్రమ శిక్షణ, అంకితబావంతో ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ బ్రహ్మోత్సవాలు



యాగం నిర్వహిస్తున్న పండితులు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలోని గణపతి దేవాలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిసాయి. గురువారం ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా జగద్గురు పుష్పగిరి శంకరాచార్య, అభినవోద్దండ విద్యా శంకర భారతి స్వామిల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలకు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పూర్ణాహుతి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సదరమ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

సికింద్రాబాద్: దివ్యాంగులు సదరమ్ సర్టిఫికెట్ కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ కోరారు. ఈనెల 5వ తేదీ వరకు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఎంతోకాలంగా దివ్యాంగులు ఎదురుచూస్తున్న సదరమ్ సర్టిఫికెట్ల కోసం ఎదురు చూస్తున్నారని, ఈ సమయంలో ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

రాంగోపాల్‌పేట్: జంటనగరాలకు చెందిన మున్నూరు కాపు విద్యార్థినీ, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు సికింద్రాబాద్ కాపు సంఘం ట్రస్టు బోర్డు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియేట్, డిగ్రీ, పాలిటెక్నిక్, మెడిసిన్, ఇంజనీరింగ్, లా, అగ్రికల్చర్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, యానిమల్ హస్బండరీ తదితర విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఈస్కాలర్‌షిప్‌లకు అర్హులని వారు తెలిపారు. ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు 040-27849399 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

ఓయూలో క్రికెట్ పోటీలు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో కేసీఆర్ కప్ క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగారం ప్రశాంత్ ఆధ్వర్యంలో యూని వర్సిటీ హెచ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ నెల 17న జరిగే మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఏటా పోటీలను నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్లా ప్రవీణ్‌రెడ్డి, తొట్లస్వామియాదవ్, కిరణ్‌గౌడ్, పడాల సతీష్ పాల్గొన్నారు.

'ఆ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలి'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్ గౌడ్ కుటుంబసభ్యులు

కంటోన్మెంట్: నిర్లక్ష్యపు వైద్యంతో నిండు ప్రాణాన్ని బలిగొన్న ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల బోయిన్‌పల్లికి చెందిన మధుసూదన్ గౌడ్ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో అతని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నప్పటికీ ఆసుపత్రిపై చర్యలు తీసుకోవడంతో మృతుడి కుటుంబ సభ్యులు శనివారం విలేకరుల సమావేశంలో పలు సందేహాలు లేవనెత్తారు. అనుభవం, అర్హతలేని వైద్యుడితో చికిత్స కారణంగానే తన భర్త చనిపోయాడంటూ మధుసూదన్ గౌడ్ సతీమణి మాధురి ఆరోపించారు. తన భర్తను ఆసుపత్రిలో చేర్పిన రాత్రి నుండి చూడనివ్వకుండా వైద్యులు తనను నిలువరించారని పేర్కొన్నారు. తమకు అనుమానం వచ్చి వేరే ఆసుపత్రిలో చేర్పిస్తామని చెప్పినప్పటికీ చికిత్స ఇస్తున్నట్లు నమ్మ బలికినట్లు తెలిపారు. తనకు కుటుంబ పోషణ భారమైందని, కూతురు విద్యతోపాటు ఆమె వివాహం చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

కారు అద్దాలకు ఫిల్మ్ అతికిస్తే చర్యలు



కార్లు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సికింద్రాబాద్: కారు అద్దాలకు టింటెడ్ ఫిల్మ్‌లు అతికించడం చట్టరీత్యా నేరమని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు చెప్పారు. శనివారం సికింద్రాబాద్-మెట్టుగూడ ప్రధాన రహదారిలోని అలుగడ్డబావి కూడలి వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు పలువురు కారు యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాల డ్రైవర్లకు పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం కారు అద్దాలకు బ్లాక్ తదితర రంగుల ఫిల్మ్‌లు అతికించడం నిషేధించిందని చెప్పారు.